పశువులకు ముద్దచర్మ వ్యాధి నివారణ టీకాలు

ఏలూరు: పశువుల్లో లంపి వైరస్ వ్యాధిని అరికట్టేందుకు జిల్లావ్యాప్తంగా 1,18,650 డోసుల టీకాలు వేశామని పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ జి.నెహ్రూ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వ్యాధి నివారణకు జిల్లకు 1,20,800 డోసుల టీకాలు వచ్చాయన్నారు. జిల్లాలో 1,09,000 ఆవులుండగా ఇంతవరకూ 1,07,009 ఆవులకు టీకాలు వేశామని తెలిపారు. ఆదేవిధంగా 11,641 గేదెలకు కూడా టీకాలు వేశామని చెప్పారు. అవసరమైన మేరకు జిల్లాకు ఇంకా టీకా డోసులు రప్పిస్తున్నామన్నారు. పట్టణ ప్రాంతాల్లో వీధి పశువులకు కూడా ముద్దచర్మ వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నామన్నారు. వ్యాధిసోకిన పశువులను మంద నుండి వేరుచేసి ఉంచాలని, దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. ముద్దచర్మవ్యాధి సోకిన పశువులకు తగిన వైద్యం చేస్తామని తెలి పారు. ముద్దచర్మ వ్యాధి ముఖ్యంగా తెల్ల పశువుల్లో (ఆవుల్లో) కనిపిస్తుందన్నారు. వ్యాధి సోకిన వాటికి నాలుగు, లేదా ఐదు రోజులు యాంటీబయాటిక్, యాంటీహిస్టమిన్ మందు లను వాడితే పశువులకు ఉపశమనం కలుగుతుందన్నారు.వ్యాధివల్ల తీవ్ర నష్టమైతే జరగదన్నారు.

ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - ఏలూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలు తిప్పికొట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జిఒ నెం.1ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పవర్‌పేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో గురువారం జిల్లా విస్తత సమావేశం ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీతారాం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల అభిప్రాయాలకు భిన్నంగా బిజెపి ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు పూనుకోవడం తగదన్నారు. దక్షిణ కొరియాకు చెందిన పోస్కో స్టీల్ కంపెనీకి, మన దేశంలోని అదాని కంపెనీకి అప్పగించాలనే తప్పుడు నిర్ణయం తీసుకుందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లోని కార్మికులు, అధికారులు, కాంట్రాక్ట్ కార్మికులు కలిసి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీని ఏర్పాటు చేసి 700 రోజులకుపైగా పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి చేతులు దులుపుకోవడం కాదని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి మన రాష్ట్ర సంపదను కాపాడాలన్నారు. మోడీ ఆదేశాల మేరకే రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్, ప్రీపెయిడ్, ట్రూఅప్ ఛార్జీల పేరుతో వినియోగదారులపై వేల కోట్ల రూపాయల భారాలు మోపుతున్నారని విమర్శించారు. వ్యవసాయ మీటర్ల వినియోగదారులపై రూ.ఆరువేల కోట్ల భారం పడుతుందని వివరించారు. రెగ్యులేటరీ కమిషన్ అనుమతి లేకుండా మీటర్ల కొనుగోలు చేయకూడదని, అయినా ఏకపక్షంగా కొనుగోలు చేశారని చెప్పారు. హరిత ఎనర్జీ పేరుతో 75 వేల ఎకరాలను అదానీకి కట్టబెట్టేందుకు ప్రభుత్వం పూనుకుంటోందని వివరించారు.

ఒక్కో స్మార్ట్ మీటరు రూ.13 వేల నుండి రూ.14 వేల వరకూ ఖర్చవుతుందని అంటే సుమారు పదివేల కోట్ల రూపాయలు ప్రజలపై భారం పడుతుందని చెప్పారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పి జగన్ మాట తప్పారని విమర్శించారు. 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ ఇస్తామన్న హామీని నిలబెట్టుకోలేదన్నారు. 2019 తరువాత మూడు నెలలకోసారి విద్యుత్ ఛార్జీలు పెంచే దిశగా ప్రతిపాదనలు పెట్టారన్నారు. ఇవికాకుండా అదనపులోను డిపాజిట్ల పేరుతో భారాలు వేశారని చెప్పారు.

మాట్లాడుతున్న మంతెన సీతారాం

ఎస్‌సి, ఎస్‌టి సామాజిక తరగతులకు ఉచిత విద్యుత్ కోత పెట్టారని విమర్శించారు. ఉచితం పేరుతో వ్యవసాయ విద్యుత్‌కు ఎసరు పెట్టారన్నారు. ప్రభుత్వం ఇదే పద్ధతిలో ముందుకెళితే 2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్ పోరాటం మాదిరే మరో విద్యుత్ పోరాటం జరుగుతుందని హెచ్చరించారు. రాష్ట్రంలో రోడ్లు, ర్యాలీలు నియంత్రించేందుకు జారీ చేసిన జిఒ నెం.1ని తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికే ఈ జిఒ తీసుకొచ్చిందన్నారు. పోలీసులకు సర్వాధికారాలు కట్టబెట్టడం ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు. పోరాడి సాధించుకున్న పౌరహక్కులను ఏ పేరుతో అణచివేసినా వ్యతిరేకిస్తామని చెప్పారు. ఈ జిఒ అమలు చేయడమంటే ప్రజలు, ప్రతిపక్షాలు, ప్రజాతంత్రవాదుల నోరు నొక్కే ప్రయత్నమేనన్నారు. జిఒను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం సమగ్రంగా అమలు చేసే వరకూ ప్రాజెక్టు పనులు ఆపాలని డిమాండ్ చేశారు. కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా మండలం మొత్తం యూనిట్‌గా తీసుకొని 2013 భూ సేకరణ చట్టం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ సమగ్రంగా అమలు చేయాలని కోరారు. నిర్వాసిత కాలనీల్లో మౌలిక సౌకర్యాలు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఏజెన్సీలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న 'అసైన్డ్ ల్యాండ్స్'కు చెందిన భూములను పేదలకు పంపిణీ చేయాలని, కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు చిత్తశుద్ధితో అమలు చేయాలని కోరారు. ఐటిడిఎలో రెగ్యులర్ పిఒగా ఐఎఎస్ అధికారిని రాష్ట్ర ప్రభుత్వం నియమించి గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసి ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్, ఎం.నాగమణి, జి.రాజు, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్, రామకృష్ణ, ముత్యాలమ్మ, నాగేంద్రరావు, ఆర్‌విఎస్, వెంకట్రావు, దుర్గారావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడిన మండలంలోని ఊటుకూరు ఫీల్డ్ అసిస్టెంట్ కె.సరితపై సస్పెన్షన్ వేటు పడింది. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలో గురువారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా చేవూరు, శ్రీహరిపురం సర్పంచులు మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ చట్టం ఫీల్డ్‌అసిస్టెంట్ల పనితీరు బాగోలేదని, వారి ఇష్టారాజ్యంగా పనులు చేయిస్తూ గ్రామ సర్పంచులకు సమాచారం ఇవ్వడం లేదని తెలిపారు. సర్పంచులకు తెలియకుండా ఉపాధి పనులు చేయిస్తూ కేవలం సంతకాలకు మాత్రమే తమ వద్దకు వస్తున్నారని డ్వామా పీడీ రాంబాబు వద్ద వాపోయారు. దీనిపై స్పందించిన పీడీ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఏపని చేసినా సర్పంచులకు మొదట సమాచారం ఇవ్వాలన్నారు. అలా కాకుండా ఇష్టారాజ్యంగా పనులు చేస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ సందర్భంగా మండలంలోని ఊటుకూరు గ్రామ ఫీల్ట్‌అసిస్టెంట్ కె.సరిత వచ్చిన అవినీతి విమర్శలపై, ఫిర్యాదులపై జరిగిన అవకతవకలకు సంబంధించి విచారణ జరిపిన ఆనంతరం సరితను సస్పెండ్ చేసినట్లు పీడీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, ఎంపిడిఒ పి.మల్లీశ్వరి, వైస్‌ఎంపిపిలు సునీత, రాధా, ఎపిఒ రాజు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛనుదారులు వార్షిక ధృవీకరణ పత్రాలు సమర్పించాలి

ప్రజాశక్తి - ఏలూరు

ట్రెజరీ కార్యాలయాల ద్వారా సర్వీస్ పెన్షన్, కుటుంబ పెన్షన్ పొందుతున్న పెన్షనర్లు అందరూ తప్పనిసరిగా ఈనెల ఒకటో తేదీ నుంచి వచ్చేనెల 28వ తేదీ వరకూ వార్షిక ధృవీకరణ పత్రాలు జీవన్‌ప్రమాణ్ పోర్టల్ ద్వారా సమర్పించాలని ఏలూరు జిల్లా ఖజానా అధికారి, టి.కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ వార్షిక ధృవీకరణ పత్రాల సమర్పణకు తప్పనిసరిగా వారి పింఛను పొందుతున్న సబ్ ట్రెజరీ కార్యాలయానికే వెళ్లాల్సిన అవసరం లేదని, వారికి దగ్గరగా ఉన్న ట్రెజరీ కార్యాలయాన్ని, మీ సేవా కేంద్రాలు, బ్యాంకులు ఇతర సర్వీస్ సెంటర్లలో వేయొచ్చని, సొంతంగా బయోమెట్రిక్ డివైజ్ కలిగిన వారు వారి ఫోన్, కంప్యూటర్ ద్వారా కూడా వేయొచ్చని తెలిపారు. ఎవరికైనా జీవన్ ప్రమాణ్ పోర్టల్‌లో నమోదు చేయడంలో ఇబ్బందులున్నా, అనారోగ్య కారణాల చేత బయటకు రాలేకపోయినా సంబంధిత ట్రెజరీ అధికారుల దృష్టికి తీసుకువెళితే వారు తగుచర్యలు తీసుకుంటారని ఆయన తెలిపారు. ఈ విషయంలో జిల్లాలో సహాయ ఖజానా అధికారులు, ఉపఖజానా అధికారులందరికి శనివారం సమావేశం నిర్వహించి తగు సూచనలు జారీ చేశారు. మంగళవారం ఏలూరు, నూజివీడులోని ఉపఖజానా కార్యాలయాలను సందర్శించి అక్కడ వార్షిక ధృవీకరణపత్రాలను సమర్పిస్తున్న తీరుని వ్యక్తిగతంగా పరిశీలించి, పింఛనుదారులు ఎక్కువ సమయం ఎదురు చూడాల్సిన అవసరం లేకుండా చూడాలని, వారికి షెల్టర్, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని సహాయ ఖజానా అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.

రిపబ్లిక్ డే రైతు ట్రాక్టర్ల ర్యాలీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రైతు సంఘాల సమన్వయ కమిటీ నాయకులు

రైతులను విస్మరించిన బిజెపి

ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమం

26న ఏలూరులో ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు

ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా ప్రధాని మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రైతాంగాన్ని మోసగించిందని ఎపి రైతు సంఘాల సమన్వయ కమిటీ నాయకులు తీవ్రంగా విమర్శించారు. దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా ఎపి రైతు సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఏలూరులో ఈనెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా రైతుల ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు రైతు సంఘాల నాయకులు ప్రకటించారు. స్థానిక పవర్‌పేటలోని అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల జిల్లా సమన్వయ కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. రిపబ్లిక్ డే రైతు ట్రాక్టర్ల ర్యాలీ పోస్టర్లను రైతు సంఘాల సమన్వయ కమిటీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో కిసాన్ కాంగ్రెస్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు జెట్టి గురునాథరావు, బికెఎంయు జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, ఎపి రైతు సంఘం జిల్లా కన్వీనర్ ఆర్.లక్ష్మణరావు, నాయకులు యు.హేమశంకర్, ఎఐకెకెఎస్ రాష్ట్ర అధ్యక్షులు డి.రంగనాథ్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహనరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, జిల్లా నాయకులు ఎల్లమ్మ, సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు బి.జగన్నాధం, వి.సాయిబాబు మాట్లాడారు.

ఢిల్లీ రైతాంగ ఉద్యమం ఫలితంగా కేంద్ర మోడీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి మోసగించిందని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50 శాతం కలిపి అన్ని పంటలకు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ మద్దతు ధరలు రైతులకు అందేలా మద్దతు ధరల గ్యారెంటీ చట్టం వెంటనే తేవాలన్నారు. బిజెపి ప్రకటిస్తున్న మద్దతు ధరలకు చట్టబద్ధత లేక రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతుల పంటల మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించకపోవడం అన్యాయమన్నారు. దేశవ్యాప్తంగా రైతులు వ్యవసాయ నష్టాలతో అప్పుల ఊబిలో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ కంపెనీలకు రుణమాఫీ చేస్తున్న మోడీ ప్రభుత్వం రైతుల పంట రుణాలు ఎందుకు మాఫీ చేయడం లేదని ప్రశ్నించారు. కేరళ తరహాలో రైతు రుణ విమోచన చట్టం తీసుకువచ్చి రైతుల పంట రుణాలు మాఫీ చేయాలని కోరారు. కేంద్ర విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగింపు ఆపాలన్నారు. సమగ్ర పంటల బీమా పథకాన్ని అమలు చేయాలన్నారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమంలో అమరులైన రైతు కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. రైతులపై బనాయించిన అక్రమ కేసులు రద్దు చేయాలన్నారు. జిల్లాలో రైతుల ధాన్యం కొనుగోలులో వస్తున్న సమస్యలు పరిష్కరించాలని, రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా ఏలూరులో అల్లూరి సీతారామరాజు స్టేడియం నుండి జిల్లా కలెక్టరేట్ వరకూ ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో రైతులు, కార్మికులు నిర్వహిస్తున్న రైతు ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ రైతు సంఘాలు, కార్మిక సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు ముప్పిడి శ్రీనివాసరావు, ఉప్పు మురళీకృష్ణ, కట్టా భాస్కరరావు, ఘంటా పాపారావు, మనికే నాగేశ్వరరావు, జి.గోపి, శేషపు మహంకాళిరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై వేధింపులు ఆపాలి : సిఐటియు

ప్రజాశక్తి - కుక్కునూరు

అంగన్‌వాడీలపై అధికారుల వేధింపులు ఆపి బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయాలని సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య భవనంలోని ప్రజాసంఘాలు కార్యాలయంలో సిఐటియు మండల కమిటీ సమావేశం అధ్యక్షులు కుంజా నాగలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ తల్లీ బిడ్డ సంక్షేమ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం మొండిచేయి చూపుతుందని విమర్శించారు. అసలే చాలీచాలని వేతనాలతో తీవ్రమైన ఇబ్బందులు పడుతుంటే మరోపక్క కొత్తకొత్త యాప్‌ల పేరుతో ఇబ్బందులు పెడుతూ సంబంధం లేని అధికారులను అంగన్‌వాడీ సెంటర్ల తనిఖీల పేరుతో ఇబ్బందిపెడుతున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచి సమస్యలు పరిష్కరించకుండా విజిట్స్ పేరుతో అవమానించడం ఏమిటని ప్రశ్నించారు. 2018 నుండి ఇంటి అద్దెలు, గ్యాస్ బిల్లులు వంటివి పెండింగ్ ఉంటే వర్కర్లు సెంటర్లు ఎలా నడుపుతారన్నారు

. ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి మార్కెట్ ధరకు అనుగుణంగా బిల్లులు ఇవ్వాలని, బకాయి వేతనాలు ఇవ్వాలని, సచివాలయ ఉద్యోగులకు అప్పజెప్పరాదన్నారు. అదేవిధంగా స్కూల్ స్వీపర్లు బకాయి వేతనాలు, మిడ్డే మిల్ వర్కర్లు పెండింగ్ బిల్లులు, హమాలీ నూతన కూలి రేట్ల జిఒలు విడుదల చేసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేదంటే పెద్ద కార్మికులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిఐటియు కోశాధికారి బి.సుజాత, ఉపాధ్యక్షులు కారం రాజేశ్వరి, సభ్యులు కారం రాధ, ఆదెమ్మ, తులసి, కుర్ర గ్రెసి, కారం రాధ, కణితి మంగ పాల్గొన్నారు.

4, 5 తేదీల్లో హేలాపురి బాలోత్సవం

24వ తేదీ వరకూ దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు

ఫిబ్రవరి 4, 5 తేదీల్లో జరగనున్న హేలాపురి బాలోత్సవంలో పాల్గొనే విద్యార్థుల పేర్లు నమోదుకు పాఠశాల నుంచి దరఖాస్తులను జనవరి 24వ తేదీ లోపు అందించాలని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ కోరారు. ఏలూరులోని పవర్‌పేటలో ఉన్న హేలాపురి బాలోత్సవం ఆఫీసులో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో బాలోత్సవం గౌరవ అధ్యక్షులు షేక్ సాబ్జీ, అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావు, కార్యదర్శి గుడిపాటి నరసింహరావు, సభ్యులు జి.శారద పాల్గొన్నారు. షేక్ సాబ్జీ మాట్లాడుతూ ఇప్పటికే ఏలూరు నగరం, ఏలూరు, పెదపాడు, దెందులూరు, పెదవేగి, భీమడోలు, ముసునూరు మండలాల్లోని 560 ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలకు దరఖాస్తు బ్రోచర్లు అందించామని తెలిపారు. జిల్లా డిఇఒ మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులందరూ 59 అకాడమిక్, కల్చరల్ అంశాల్లో పాల్గొనేందుకు అనుమతి మంజూరు చేస్తూ సర్క్యులర్ విడుదల చేశారన్నారు. ప్రభుత్వ ప్రయివేట్ విద్యాలయాల హెడ్ మాస్టర్లు, ఉపాధ్యాయులు తమ తమ స్కూల్స్ విద్యార్థులను హేలాపురి బాలోత్సవంలో పాల్గొనడానికి వీలుగా దరఖాస్తులు బాలోత్సవం ఆఫీసులో 24వ తేదీ లోపు అందించాలన్నారు. ఏలూరు పరిసర ప్రాంతాల్లో ఉన్న దాతలు, పెద్దలు బాలోత్సవం నిర్వహణకు అవసరమైన నిధులు అందించి ప్రోత్సహించాలని కోరారు. బాలోత్సవం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ బాలోత్సవం జయప్రదానికి వివిధ రంగాలు, సంస్థలకు 300 మందితో ఆహ్వాన సంఘం ఏర్పాటు చేసి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బాలోత్సవం ప్రధాన కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రోజుకు ఐదు వేల మందికి భోజన ఏర్పాట్లు, 59 అంశాల్లో 700 మంది విజేతలకు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. కార్యదర్శి గుడిపాటి నరసింహరావు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రయివేట్ విద్యాలయాల హెడ్ మాస్టర్లు, ఉపాధ్యాయులు తమ తమ స్కూల్స్ విద్యార్థులను హేలాపురి బాలోత్సవంలో పాల్గొనడానికి వీలుగా దరఖాస్తులు బాలోత్సవం ఆఫీసుకు 24వ తేదీ లోపు అందించాలని విజ్ఞప్తి చేశారు.

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజలు మెచ్చేలా నేరస్తులు భయపడేలా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై ఉక్కుపాదం మోపేలా నేర నియంత్రణకు పోలీస్ అధికారులందరూ పటిష్టంగా, సమన్వయంతో పని చేయాలని జిల్లా ఎస్‌పి రాహుల్ దేవ్ శర్మ ఆదేశించారు. నేర సమీక్ష సమావేశం ఏలూరు పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు సబ్ డివిజన్, కైకలూరు సర్కిల్ పోలీస్ స్టేషన్ల అధికారులతో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నేర నియంత్రణకు పటిష్టంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు పోలీసులు జవాబుదారీతనం అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. దర్యాప్తు అంశాల్లో విధి నిర్వహణలో అలసత్వం వహించే అధికారుల తీరు మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు ఎప్పటికప్పుడు మారుతున్న చట్టాల గురించి, కోర్టు కేసుల విషయాల గురించి తెలుసుకొని కోర్టు విధులు నిర్వహించే సిబ్బందికి సరైన మార్గదర్శకాలను ఇవ్వాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపాలని, హాని కలిగించే మత్తు పదార్థాలు నాటు సారా, గంజాయి, గుట్కా, ఖైని నియంత్రణ విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. హైవే రహదారిపై వాహన తనిఖీలు నిర్వహిస్తూ రాత్రిపూట వాహనదారులకు ఫేస్ వాష్ డ్రైవ్‌ను నిర్వహిస్తూ రహదారి ప్రమాదాల నివారణకు రోడ్ సేఫ్టీ మొబైల్స్ సిబ్బంది పర్యవేక్షణ చేయాలని సూచించారు. దొంగతనాలను అరికట్టడానికి ఎల్‌హెచ్‌ఎంఎస్ వినియోగంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. మహిళల ఫిర్యాదుల పట్ల వెంటనే స్పందించి వారికి సకాలంలో న్యాయం చేయాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులపై కాలపరిమితి లోపు చర్యలు తీసుకొని విచారణ అంశాలను సిసిటిఎన్‌ఎస్ ద్వారా జిల్లా ప్రధాన కార్యాలయానికి తెలియజేయాలని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్‌ఇబి అదనపు ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు, ఏలూరు ఇన్‌ఛార్జి డిఎస్‌పి జివిఎస్.పైడేశ్వరరావు, ఇన్‌ఛార్జి జంగారెడ్డిగూడెం డిఎస్‌పి కెవి.సత్యనారాయణ, పోలవరం డిఎస్‌పి లతాకుమారి, నూజివీడు డిఎస్‌పి అశోక్ కుమార్ గౌడ్, ఎస్‌ఇబి ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, జిల్లా న్యాయ సలహాదారులు కె.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడపొద్దు

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు పట్టణంలోని ప్రాంతీయ రవాణా కార్యాలయ ఆవరణలో 34వ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా గురువారం డ్రైవర్లకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవిఐలు మురళి, ప్రసాద్, ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి నండూరి స్ఫూర్తి, ఎస్‌ఐ వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మద్యం తాగి వాహనాలను నడిపితే ప్రాణాపాయం సంభవించే ప్రమాదం ఏర్పడుతుందని హెచ్చరించారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాన్నారు. కార్లు నడిపే సందర్భంలో సీటు బెల్ట్‌ను అశ్రద్ధ చేయవద్దని, ప్రమాదాలకు గురి కావద్దని సోదాహరణంగా వివరించారు. ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ఇటీవల కాలంలో మైనారిటీ తీరకుండానే వాహనాలను నడపడం అనేక రోడ్డు ప్రమాదాలకు ప్రధానమైన కారణాలుగా తెలుస్తోందన్నారు. మైనారిటీ తీరకుండా వాహనాలను నడిపితే వాహన యజమానులతో పాటు తల్లిదండ్రులకు కూడా శిక్షలు తప్పవని హెచ్చరించారు. రానురాను నిబంధనలు కఠిన తరం చేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే నిబంధనలు మానవాళి సుఖ సంతోషాలతో జీవించటానికేననే నిజాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు.

అర్హురాలికి 'చేయూత' కరువు..!

అన్ని అర్హతలున్నా పడని సొమ్ము

వాపోతున్న బాధితురాలు

ప్రజాశక్తి - నూజివీడు

దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వడనే చందంగా అర్హులు అయినప్పటికీ సంక్షేమ పథకాలు పేదలకు చేయూత నివ్వని దుస్థితి ముసునూరులో చోటు చేసుకుంటుంది. వాలంటీర్ల నిర్లక్ష్యమో, సచివాలయ సిబ్బంది బాధ్యత రాహిత్యమో తెలియని స్థితిలో ప్రభుత్వ పథకాలు అర్హులకు అందని ద్రాక్షగా మారుతున్నాయి. ముసునూరుకి చెందిన రంగోజు కృష్ణకుమారి నిరు పేదరాలు. ప్రస్తుతం ఆమె వయసు 50 ఏళ్ళు, చేయూత పథకానికి అన్ని విధాలా అర్హురాలు అయినప్పటికీ ఆ పథకం ఆమెకు (2021, 2022) రెండేళ్లుగా అందక అనేక అవస్థలు పడుతుంది. ఆమె గత 25 ఏళ్లుగా షుగర్ వ్యాధితో బాధపడుతుంది. కాళ్లకు పుండ్లు పడి నడవలేని స్థితిలో బయటకు రాలేక గత మూడేళ్లుగా ఇంటికే పరిమితమైంది. 2020లో చేయూత పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టినప్పుడు కృష్ణ కుమారికి ఆ పథకం వర్తించి రూ.18500 తీసుకుంది. అనంతరం ఏమైందో ఏమో గాని గత రెండేళ్లుగా రెండు, మూడు విడతలకు సంబంధించి చేయూత పథకం సొమ్ము అందడంలేదు. ఎందుకు ఆగిందో తెలియక ముసునూరు సచివాలయం-2లోని వెల్ఫేర్ అధికారి జ్యోతి, ఎంపిడిఒ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ సన్నీ చుట్టూ రెండేళ్లుగా ప్రదక్షణలు చేస్తున్నారు.

2021లో ఆగిపోవడంతో జాగ్రత్త పడ్డ కృష్ణకుమారి, ఆమె భర్త, ఆమె కుమారులు ముసునూరు సచివాలయంలో సంప్రదించి 2022 చేయూత అందాలంటే ఏం చేయాలో అది చేశారు. వాలంటీర్ అశోక్ చుట్టూ కొన్నాళ్లుతిరిగి మ్యాపింగ్ చేయించారు. అనంతరం కొత్తగా కుల, ఆదాయ ధ్రువపత్రాలను తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగి తెచ్చిచ్చారు. బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్ లేదంటే అదీ చేయించారు. తిరిగి తిరిగి వాళ్లు చెప్పినవన్నీ చేయించిన తర్వాత తిరిగి సచివాలయంలో కొత్తగా ఆన్‌లైన్ చేశారు. అయితే గతేడాది సెప్టెంబర్‌లో చేయూత సొమ్ము ముసునూరులో అందరికి అందింది. కృష్ణకుమారికి మాత్రం పడలేదు. అప్పటి నుంచి మళ్లీ సచివాలయం చుట్టూ కృష్ణకుమారి, ఆమె కుటుంబ సభ్యులు తిరుగుతూనే ఉన్నారు. ఆన్‌లైన్ అయిందని, పూర్తి వివరాలు రావడంలేదని, ఎందుకు ఆగిందో తమకు తెలియడం లేదని వెల్ఫేర్ అధికారి జ్యోతి, ఎంపిడిఒ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ సన్నీ తెల్చి చెప్పారు. 1902కి ఫోన్ చేస్తే మీరు అర్హురాలుగా ఉన్నారని, సొమ్ము పడుతుందని చెబుతున్నారని, కాని పడటంలేదని కృష్ణకుమారి, ఆమె కుటుంబసభ్యులు వాపోతున్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు వచ్చేవి ఆగిపోతే సరిచేసే ఆప్షన్ అనేది లేదనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. సంక్షేమ పథకాలు ఆగిపోతే అర్హులైన పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

అధికారులకు సమస్య వివరిస్తున్న కృష్ణకుమారి

సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదు

చేయూత సొమ్ము తనకు రెండేళ్లుగా పడటంలేదని రంగోజు కృష్ణకుమారి నూజివీడు సబ్ కలెక్టర్‌కి, ముసునూరు ఎంపిడిఒకు పలుమార్లు మొరపెట్టుకున్నా సమస్య మాత్రం పరిష్కారం కాకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంక్షేమ పథకాలు ఆగిపోతే పేదల పరిస్థితి అరణ్య రోదనలాగా మారిందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. కృష్ణకుమారి వంటి చెప్పుకోలేని పేదలు ఇంకెంతో మంది ఉన్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చేయూత అందక అవస్థలు పడుతున్న పేదలు ముక్తకంఠంతో కోరుతున్నారు.



మాట్లాడుతున్న జెసి అరుణ్‌బాబు

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు

ప్రజాశక్తి - ఏలూరు

గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై గురువారం స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు ఏలూరు పోలీస్ పెరేడ్ మైదానంలో గణతంత్ర దినోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ జాతీయ జెండాను ఆవిష్కరిస్తారన్నారు. గణతంత్ర దినోత్సవ నిర్వహణకు మైదానాన్ని సిద్ధం చేయాలని, తాగునీరు ఏర్పాటు చేయాలని, పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని ఆర్‌అండ్‌బి, నగరపాలక సంస్థ తదితర శాఖల అధికారులను ఆయన ఆదేశించారు. పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ప్రాథమిక వైద్య చికిత్స శిబిరం ఏర్పాటు చేయాలని, తగినన్ని మాస్కులు, శానిటైజార్లు అందుబాటులో ఉంచాలని డిఎంహెచ్‌ఒను అదేశించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు ఏలూరు ఆర్‌డిఒ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. అభివృద్ధి సంక్షేమ శాఖలు తమ శాఖల ప్రగతిని తెలియజేసే ప్రదర్శనలను ఏర్పాటు చేయాలన్నారు. శకటాల ఏర్పాటుపై కొత్తదనం ఉండాలని, వీటి ఏర్పాట్లు పీడీ డిఆర్‌డిఏ, డ్వామా పీడీ పర్యవేక్షించాలని తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగులకు అందించే ప్రశంసా పత్రాలకు సంబంధించి జాబితాను ఈ నెల 23 తేదీలోగా అందించాలని జిల్లా అధికారులను జాయింట్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎవిఎస్‌ఎస్.మూర్తి, ఏలూరు ఆర్‌డిఒ కె.పెంచాల కిషోర్, ఏలూరు డిఎస్‌పి పైడేశ్వరరావు పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న మాధురి

మహిళా పోలీసుకు ప్రతిభ అవార్డు

ప్రజాశక్తి - గణపవరం

జల్లి కాకినాడ గ్రామానికి చెందిన మహిళా పోలీస్ జిఎంఎస్‌కె.మాధురి ప్రతిభ అవార్డు అందుకున్నట్లు గణపవరం ఎస్‌ఐ వి.వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం జిల్లా ఎస్‌పి కార్యాలయంలో ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ చేతులమీదుగా ప్రతిభ అవార్డు అందుకున్నట్లు గణపవరం ఎస్‌ఐ వి.వెంకటేశ్వరరావు చెప్పారు. ప్రతిభ అవార్డు అందుకున్న మాధురిని ఎస్‌ఐ వెంకటేశ్వరరావు, సిఐ సుభాష్, సిబ్బంది అభినందించారు.

పట్టుబడిన జింక

రమణక్కపేటలో జింక సంచారం

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని గ్రామాల్లో వన్యప్రాణి జింక సంచారం చేస్తోంది. గురువారం రమణక్కపేట గ్రామస్తులకు కనపడటంతో గ్రామానికి గుప్త సతీష్ ఆ జింకను భవిష్యత్తు తరాలవారికి ఆదర్శంగా నిలవాలంటే వన్య ప్రాణులను కాపాడటం తమ బాధ్యత అంటూ తమ ఇంట్లోనే భద్రంగా ఉంచి అటవీశాఖ అధికారులకు, వన్యప్రాణి జీవన అధికారులకు సమాచారం అందించి వారికి అప్పగించారు.

రైతులకు పలు సూచనలు చేస్తున్న ఎఓ మీనాకుమారి

వరి పంటల పరిశీలన

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో రబీ వరిలో కాండం తొలుచు పురుగు, ఉధృతంగా ఉందని అగ్రికల్చర్ ఎఓ మీనాకుమారి అన్నారు. మండలంలోని రాఘవపురం గ్రామంలో వరి పొలాలను గురువారం ఆయన పరిశీలించి రైతులకు సలహాలు అందించారు. కాండం తొలుచు పురుగు వల్ల నాట్లు వేసిన పొలాల్లో మొక్కలు పిలకలు చనిపోవటం జరుగుతుందని తెలిపారు. నాట్లు వేసేటప్పుడు నారు చివర తుంచి నాట్లు వేసుకోవాలని, దీంతో కాండం తొలుచు పురుగు సముదాయం నాశనం అవుతుందన్నారు. ఎకరానికి 8 నుంచి పది లింగాకార్షక బుట్టలు పెట్టాలని సూచించారు. రైతులు సలహాలు, సూచనల కోసం దగ్గరలో ఉన్న వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కోరారు.

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

నాడు నేడు పనులు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

నాడు-నేడు పనులు త్వరగా పూర్తి చేయాలని చింతలపూడి ఎంపిపి రాంబాబు అన్నారు. పట్టణంలో సర్వసభ్య సమావేశం ఎంపిడిఒ మణికుమారి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు నేడు పనులు మధ్యలో నిలిచిపోయాయని, వాటిని త్వరగా పూర్తి చేయాలని, ప్రభుత్వ లక్ష్యం దిశగా కృషి చేయాలన్నారు. అధికారులు సమన్వయం పాటించి, అందరం కలిసి పనిచేస్తేనే మండలం అభివృద్ధి చెందుతుందని చెప్పారు.

ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇపై ఫిర్యాదులు

ఏ పని చెప్పినా ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ పట్టించుకోవడంలేదని సర్పంచులు ఎంపిపి రాంబాబు దృష్టికి తీసుకొచ్చారు. కనీసం సరిగా స్పందించడంలేదని తెలిపారు. దీనిపై ఆర్‌డబ్ల్యుఎస్ సమాధానం చెప్పవలని అడుగగా సభ మర్యాదలు పాటించకుండా సమాధానం చెబుతుండగా అందరూ విస్మయం చెందారు. దీంతో ఆతడిని మండల సమావేశం నుంచి బయటకు పంపించారు.

21న ఎపిడబ్ల్యుజెఎఫ్ మహాసభ

ప్రజాశక్తి - చింతలపూడి

జర్నలిస్టుల సంక్షేమానికి ఎపి వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య (ఎపిడబ్ల్యుజెఎఫ్) కట్టుబడి ఉందని చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కండ్రేగుల నాగ చిన్నారావు అన్నారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ నియోజకవర్గ మహాసభ ఈ నెల 21వ తేదీన శనివారం చింతలపూడి లయన్స్ క్లబ్ కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మహాసభకు రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, అడ్‌హక్ కమిటీ, పాత, కొత్త సభ్యులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఈ మహాసభలో నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక, సంఘ భవిష్యత్ కార్యాచరణ గురించి చర్చించి తీర్మానం నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని మండలాల పాత్రికేయ సోదరులు పాల్గొనాలని కోరారు.

డిసిపి సత్తిబాబును కలిసిన మాలమహానాడు నాయకులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ సిటీ డిసిపి మేకా సత్తిబాబును రాష్ట్ర మాలమహానాడు, అనుబంధ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శివా నాగజగన్‌బాబూరావు డిసిపి కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయనతో పాటు మాదిగ దండోరా జిల్లా అధ్యక్షులు ఏసుపోగు దానియేలు, రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ముస్లిం మెనార్టీల సంక్షేమ సంఘం మహిళ అధ్యక్షురాలు నల్లగంటి సాయివెంకటపద్మావతి ఉన్నారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జీలుగుమిల్లి గ్రామానికి చెందిన ఆళ్ల సుబ్బారావు గురువారం పొలంలో పనులు ముగించుకుని బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై లారీ ఢీ కొట్టడంతో కింద పడి గాయాల పాలయ్యాడు. ఇది గమనించిన స్థానికులు అతడిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

వ్యక్తి అనుమానస్పద మృతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక పాత బస్టాండ్ సమీపంలో నివాసం ఉంటున్న ఎస్‌కె నందు సాహెబ్ అనుమానాస్పదంగా మృతి చెందాడు. కార్ డ్రైవర్‌గా పని చేస్తున్న నందు సాహెబ్ (45) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు చెబుతున్నారు. ఇటీవల కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని బంధువులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై స్థానిక పోలీసులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

డ్రెయిన్లపై అక్రమ నిర్మాణాలు

స్తంభిస్తున్న మురుగునీరు
పట్టించుకోని అధికారులు
రోగాల బారిన ప్రజలు

జరుగుతున్న అక్రమ నిర్మాణం

ప్రజాశక్తి- ముదినేపల్లి

అధికారులు అలసత్వం, పాలకుల నిర్లక్ష్యంతో మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న మేజర్, మైనర్ డ్రెయిన్లు అక్రమణాలకు గురవుతున్నాయి. అధికారుల కళ్లముందే డ్రెయిన్లపై అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా అటు అధికారులు, ఇటు పాలకులు ఏమాత్రం తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో కొందరు స్వార్థపరులు ధనార్జనే ధ్యేయంగా డ్రెయిన్లపై అక్రమ నిర్మాణాలు చేపట్టి అద్దెలు ఇస్తూ వేలాది రూపాయాలు సొమ్ము చేసుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వీరికి అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు అండదండలు పుష్కలంగా ఉండడంతో చెలరేగిపోతూ డ్రెయిన్లను పూడ్చివేసి పక్కా అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నట్లు ప్రజల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ముదినేపల్లి నుంచి వడాలి వరకు ఉన్న వడాలి రోడ్డు సైడ్ డ్రెయిన్‌పై అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. ముదినేపల్లి నుంచి మూడు కిలోమీటర్ల పైబడి ఈ డ్రెయిన్ ప్రవాహించి వడాలి ఊరు చివర ఉన్న పెదకొమ్మిలేరు డ్రెయిన్‌లో కలుస్తోంది. ముదినేపల్లి నుంచి వడాలి వరకు రెండు కిలోమీటర్ల మేర కొందరు స్వార్థపరులు తమ ఇళ్ల ముందుగా ప్రవాహిస్తూ ప్రధాన రహదారి వెంబడి వెళ్లే ఈ డ్రెయిన్‌పై అక్రమ నిర్మాణాలు చేపట్టి సొమ్ము చేసుకుంటున్నట్లు పలువురు చెబుతున్నారు. మూడు మీటర్ల వెడల్పు ఉన్న డ్రెయిన్‌ను సగం వరకు పూడ్చివేసి డ్రెయిన్‌పై పక్క కట్టడం నిర్మించి స్లాబ్ వేసి దుకాణాలు నిర్మించి అద్దెలకు ఇస్తున్నారు. ఒకో షాపునకు నెలకు రూ.ఐదు వేల నుంచి ఏడు వేల వరకు అద్దెలు వసూలు చేస్తూ జేబులు నింపుకుంటున్నట్లు సమాచారం. మండల పరిషత్ కార్యాలయం, మండల రెవెన్యూ కార్యాలయం సమీపంలో, పూర్ణిమ థియేటర్ వద్ద ఆటోనగర్ వద్ద డ్రెయిన్‌పై అక్రమ నిర్మాణాలు తంతు జరుగుతున్నా ఏ అధికారి పట్టించుకున్న పాపాన పోలేదంటున్నారు. ఈ అక్రమ నిర్మాణాలు గురించి ప్రజలు ఫిర్యాదు చేసిన సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదంటూ చెబుతున్నారు. సంబంధిత అధికారులు అక్రమ నిర్మాణాలు చేస్తున్న వారి వద్దకు వెళ్లి అడ్డుకోవాల్సిందిపోయి వారి వద్ద ముడుపులు పుచ్చుకుని వెళ్లిపోతున్నారని ఈ డ్రెయిన్ వెంబడి ఉన్న నివాసితులు ఆవేదన చెందుతున్నారు. ముదినేపల్లి, పెయ్యేరుకాలనీ, ఆటోనగర్, మసీదు ప్రాంతాలకు చెందిన ఇళ్లలోని వాడుక నీరు, వర్షపు నీరు డ్రెయిన్ వెంబడి ఉన్న పంట పొలాల్లోని మురుగునీరు ఈ డ్రెయిన్ ద్వారానే బయటకు వచ్చి వడాలి ఊరు బయట పెదకొమ్మిలేరులో కలుస్తోంది. ఈ డ్రెయిన్‌ను సగం పూడ్చి అక్రమ నిర్మాణాలు చేపట్టడం ద్వారా పై ప్రాంతాలకు చెందిన ప్రజలు వాడిన నీరు, వర్షపు నీరు, పొలాల్లోని మురుగు నీరంతా డ్రెయిన్‌లోకి వచ్చి పారుదల లేక ముందుకు కదలక ఇళ్ల ముందే రోజుల తరబడి నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెంది ప్రజలపై దాడి చేయడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. వర్షా కాలంలో అయితే వర్షపు నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేక రోడ్లపై చేరి వారాల తరబడి నిల్వ ఉంటుంది. దీంతో ఈ ప్రాంత ప్రజలు, పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమకాటుతో కొందరు రోగాల బారిన పడి ఆసుపత్రుల్లో చేరి వేలాది రూపాయిలు వైద్యం కోసం ఖర్చు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పదిండి. ఈ పరిస్థితి ఎంతో కాలంగా ఉన్నా ఏ అధికారి పట్టించుకోలేదని ఈ ప్రాంత ప్రజలు వాపోతోన్నారు.

ముదినేపల్లిలోని గుడ్లవల్లేరు రోడ్డులో రోడ్డుకు ఇరువైపుల ఉన్న డ్రెయిన్లపై కూడా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. కొందరు వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా డ్రెయిన్లపై అక్రమ నిర్మాణాలు చేపట్టి అద్దెలకు ఇస్తూ విలాసవంతంగా జీవిస్తున్నారు. గురజ రోడ్డులోని ఆత్మకోడు డ్రెయిన్‌ను కొందరు దర్జాగా కబ్జా చేస్తూ పక్కా కట్టడాలు నిర్మించి అద్దెలకు ఇస్తుండగా, మరికొందరు కబ్జా చేసిన స్థలాన్ని లీజుకు ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుడ్లవల్లేరు రోడ్డులో డ్రెయిన్లపై అక్రమ నిర్మాణాల కారణంగా వర్షపు నీరు, ఇళ్లలోని వాడుక నీరు బయటకు పారక రోడ్లపై రోజుల తరబడి నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. అక్రమ నిర్మాణాలు చేపట్టిన వ్యాపారులు నిత్యం దుకాణాల్లోని చెత్త చెదారం డ్రెయిన్లలో వేయడంతో డ్రెయిన్లు చెత్తతో పూడుకుపోయి మురుగునీరు డ్రెయిన్‌లో పారుదల కాక ఆర్అండ్‌బి రోడ్లపై, గ్రామంలోని అంతర్గత సిసి రోడ్లపై ప్రవహిస్తుంది. దీంతో ఈ ప్రాంత నివాసితులు దోమలతో, మురుగు వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

డ్రెయిన్‌పై అక్రమంగా నిర్మించిన షెడ్డు

ఇప్పటికైనా అధికారులు స్పందించి వడాలి రోడ్డు సైడ్ డ్రెయిన్‌పై నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలు, గురజ రోడ్డులోని డ్రెయిన్లపై ఉన్న అక్రమ నిర్మాణాలు తొలగించి, ఇళ్లలోని వాడుక నీరు, పొలాల్లోని మురుగునీరు, వర్షపు నీరు సక్రమంగా డ్రెయిన్లలో ప్రవహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత నివాసితులు అధికారులను కోరుతున్నారు. ఈ అక్రమ నిర్మాణాల విషయమై సంబంధిత డ్రెయినేజీ ఎఇ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

NAME CHANGE

I ABDUR RAHMAN, S/o. ATAUR RAHMAN QURESHI, R/o. 1-15-11, Opp. RTC Complex, Beside Masjid, Yadavallivari Street, Tadepalligudem, West Godavari Dist., Andhra Pradesh, have changed my name from **ABDUR RAHMAN** (Old Name) to **ABDUR RAHMAN QURESHI** (New Name). Hence forth I am being called as **ABDUR RAHMAN QURESHI** (New Name) for all purposes.

'మానస' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

విద్యార్థులకు క్రమశిక్షణ అలవర్చడంతో పాటు మంచి విద్యాబోధన చేసి వారు ఉన్నత స్థానాలకు చేరడానికి ప్రోత్సహిస్తున్న భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల యాజమాన్యం సేవలు అభినందనీయమని పలువురు విద్యార్థుల కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. దీనికి అదనంగా వారు ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించేందుకు ప్రతిభ ఆధారంగా ప్రోత్సాహక నగదు పురస్కారాలు అందిస్తున్న తీరు అభినందనీయమని వారు తెలిపారు. మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 2022 విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు నగదు పురస్కారాన్ని అందించారు. దీనిలో భాగంగా 580 పైగా మార్కులు సాధించిన తంగెళ్ల సహిత, గండి వినయవర్మలకు ఒక్కొక్కరికి రూ.20 వేల వంతున, 575 పైగా మార్కులు సాధించిన జి.జయచంద్ర సత్య మణికంఠకు రూ.పది వేల నగదు పురస్కారాన్ని పాఠశాల ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్ర కుమార్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు దశాబ్దాల కాలంగా భీమడోలు మండలంలో విద్యావ్యాప్తికి తమ పాఠశాల యాజమాన్యం తమ వంతు సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఇదేవిధంగా అందుబాటు ఫీజులతో విద్యార్థులందరు మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేందుకు తనతో పాటు పాఠశాల సిబ్బంది సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు.



విద్యార్థులకు నగదు పురస్కారం అందిస్తున్న ప్రిన్సిపల్ రవీంద్ర కుమార్

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No. 734, 735, 736/2022 in O.S.No. 24/2014

పిటీషనర్: రాట్నాల శ్రీనివాసరావు
రెస్పాండెంట్లు: రాట్నాల రత్నమాణిక్యం, అదర్స్
R-7: Maragani Pavani Srilatha, W/o. Srinivas (Late)
R-8: Kamineni Meena Manvi, W/o. Not Known.
R-9: Maragani Hitishi, D/o. Srinivas (Late) Residence of Bhaskar Heihts Apartments, Backside of Xovei Boys Canvent, Flat No. 302, Vidya Nagar, Eluru, Eluru District.

ఈ పై ఐ.ఎ.నెంబర్లులో R-7 to R-9 రెస్పాండెంట్లు నోటీసు అందుకొనకుండా కాలయాపన చేయుచూ వచ్చుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు **ది.27-01-2023 తేదీన వాయిదా వేసినారు. సదరు వాయిదా తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు కోర్టు వారి ముందు హాజరు అయ్యి మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను.** లేని ఎడల కోర్టు వారు పై ఐ.ఎ. నెంబర్లను మీ పరోక్షమున తీర్మానించబడును.

YERRA VENKATA NARASIMHA RAO
DATTALA WILLINGSTON
Advocates, Bhimavaram

వేమన పద్యాలు ఆచరణీయం

పలుచోట్ల జయంతి సభలు

భీమడోలులో...

ప్రజాశక్తి - భీమడోలు

సరళమైన భాషలో అందరికీ అర్థమయ్యే రీతిలో కవి వేమన అందించిన విశ్వదాభిరామ వినుర వేమ పద్యాలు, వాటి సారాంశం నేటికీ ఆచరణీయమని భీమడోలు శాఖా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు, గ్రంథ పాలకులు కె.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం సాయంత్రం శాఖా గ్రంథాలయంలో వేమన జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్, గ్రంథ పాలకులు మాట్లాడుతూ 1839 సంవత్సరంలో విదేశీయుడైన పిసి బ్రౌన్ వేమన పద్యాలు తెలుగులో అందుబాటులోకి తెచ్చారన్నారు. వాటి విశిష్టత కారణంగా అందరి నోట పద్యాలను ఇప్పటికీ వింటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని వేమన పద్యాలను వల్లించారు.

గణపవరం : యోగి వేమన పద్యాల గొప్పతనం వర్ణించలేనిదని వైసిపి మండల నాయకులు ఐవి నరసింహరాజు అన్నారు. యోగి వేమన జయంతిని పిప్పర గ్రంథాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నరసింహరాజు మాట్లాడుతూ వేమన పద్యాలు ప్రజలందరికీ అర్థమయ్యే భాషలో అందించిన మహా వ్యక్తి అని అన్నారు. అన్ని తరాల వారికి ఆయన పద్యాలు మార్గదర్శమన్నారు. గుడ్ల వీరన్న రిటైర్డ్ పీడీ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు గుడ్ల సీతారామయ్య ఎన్ఆర్ఐ గ్రంథాలయానికి శాశ్వత విరాళంగా రూ.పది వేలు గుడ్ల వెంకటేశ్వరరావు చేతుల మీదుగా అందించారు.

గణపవరంలో...

IN THE COURT OF THE ADDL. SENIOR CIVIL JUDGE :: ELURU WEST GODAVARI DISTRICT
I.P.No. 12/2022

Between:
1) Addagalla Srinivasa Rao
2) Addagalla Subhashini
...Petitioners /Debtors
VS
Nerusu Vijaya and 31 Others
...Respondents /Creditors

TO:
R-14: Bendedi Swarnalatha, W/o. Chandra Mohan, R/o. D.No. 6-3-2, Near Markendiya Swami Temple, Dhakshinapuveedhi, Eluru, W.G.Dt.
R-18: Gadhipenta Lakshmi, W/o. Apparao, R/o. D.No. 11/2, Madepalli, Eluru, W.G.Dt.
R-22: S.Durga, R/o. D.No. 2B-1-7, Near K.K.R. School, sartampadu, Eluru, W.G.Dt.
R-23: G.Ganga, R/o. D.No. 2A-1-3, Near K.K.R. School, Satrampadu, Eluru, W.G.Dt.

Where as, the Petitioners filed petition to declare them as an insolvents, the Hon'ble Court was pleased to ordered notice to you. Therefore you are informed to appear before the **Hon'ble Court on 20-01-2023 at 10:30 A.M.** else the matter will be decided according to law.

P.VENKATA RAJU,
Advocate, Eluru.

కొట్టుకుపోతున్న రోడ్డు మార్జిన్లు

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయ సమీపంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళ్లే దారి వెంబడి మార్జిన్లు కొట్టుకుపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆ పక్కనే ఉన్న మంచినీటి పైపులైన్లు, టెలిఫోన్ ఆప్టికల్ ఫైబర్ కేబుల్ వైర్లు సైతం ధ్వంసం అవుతున్నాయి. దీనిపై పలుమార్లు స్పందన కార్యక్రమంలో అధికారులకు అర్జీలు సమర్పించినా స్పందించటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఇటుగా అన్ని శాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులు సంచరిస్తున్నప్పటికీ ఏమాత్రం పట్టించుకోవడంలేదని స్థానికంగా నివసిస్తున్న ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైర్లకు సకాలంలో మరమ్మతులు నిర్వహించి, కోతకు గురవుతున్న రోడ్ల మార్జిన్లను సరి చేయాలని కోరుతున్నారు. మరమ్మతులు నిర్వహించకుంటే రోడ్డు మార్గంలో మరింతగా కోతకు గురై ప్రమాదాలు పెరిగే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళ్లే 108, అంబులెన్సులు, అత్యవసరంగా ఆసుపత్రులకు చేరాల్సిన రోగులు సైతం ప్రమాదాల బారిన పడాల్సి వస్తోందని వాపోతున్నారు.

కొట్టుకుపోయిన రోడ్డు మార్జిన్

సత్యనారాయణ కుటుంబానికి పలువురి పరామర్శ



సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఎన్‌పిఆర్‌డి నాయకులు, విభిన్న ప్రతిభావంతులు ఆవుల సత్యనారాయణ కుటుంబానికి పలువురు పరామర్శ తెలిపారు. మండలంలోని తాడువాయిలో గురువారం ఎన్‌పిఆర్‌డి జిల్లా కమిటీ సభ్యులు ఆవుల సత్యనారాయణ కుటుంబానికి పలు జిల్లా సంఘాల, విభిన్న ప్రతిభా వంతుల నాయకులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌పిఆర్‌డి జిల్లా మహిళా అధ్యక్షురాలు షేక్ సుభాషిణి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల హక్కుల సాధనకు ఆవుల సత్యనారయణ ఎనలేని సేవలు అందించారరన్నారు. ఆయన లేవలేని స్థితిలో ఉన్నాసరే తోటివారికి సహాయం చేయాలని ఆలోచన ఎప్పుడూ ఉండేదని తెలిపారు. ఆయన మరణం ఎన్‌పిఆర్‌డికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. విభిన్న ప్రతిభా వంతుల కోసం ఆవుల సత్యనారయణ మండలంలో అనేక పోరాటాలు, నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారని తెలిపారు. 2019 చలో ఢిల్లీ వెళ్లి ఆల్ ఇండియా పోరాటంలో పాల్గొని వికలాంగుల 2016 చట్టం పటిష్టంగా అమలు చేయాలనే విషయాలు క్షేత్రస్థాయిలోకి తీసువెళ్లారని తెలిపారు. మండలంలో తాడువాయి గ్రామంలో ఎర్ర కాలువ మిగులు భూములు వికలాంగులకు కూడా చెందాలని పెద్ద ఎత్తున భూ పోరాటం నడిపించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటిస్తూ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పిఆర్‌డి జిల్లా అధ్యక్షులు కుందేటి జయరాజు, విభిన్న ప్రతిభావంతుల ఉద్యోగుల సంఘం నాయకులు ఆసి బాబు మాస్టారు, నాగరాజు మాస్టారు, విభిన్న ప్రతిభావంతుల సంఘం నాయకులు రాము, దుర్గారావు పాల్గొన్నారు.

'ఎస్‌సి వర్గీకరణ చేయాలి'

ఏలూరు టౌన్ :కొమడవోలు గ్రామం-1 డివిజన్ ప్రాంతంలో ఎంఆర్ పిఎస్, ఎంఎస్‌పి ముఖ్య నాయకుల సమావేశం జిల్లా కోఆర్డినేటర్ కాశీకృష్ణ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఉపాధ్యాయ జిల్లాల ఇన్‌ఛార్జి బయ్యారపు రాజేష్‌రావు హాజరై మాట్లాడారు. ఈ నెల 25వ తేదీన ఏలూరు జిల్లాలో నిర్వహించే ఎంఎస్‌పి, ఎంఆర్‌పిఎస్ జిల్లా సమావేశానికి ప్రతి ఒక్క దళితులు పాల్గొని దళితుల రాజ్యాధికారం కోసం పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కాశీ కష్ణ మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ చేయాలని, లేకపోతే రానున్న ఎన్నికల్లో బిజెపికి దళిత ఓట్లు వేయకుండా ఓడించి బుద్ధి చెబుతామని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో పత్తి మాధవరావు, ఎంఎస్‌పి జిల్లా నాయకుల్లు బుజ్జి, పఠాన్ ఆలీ పరిసిపోగు బాలరాజ్, చిన్న సుబ్బారావు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఈ ప్రకటన మూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా.., నా క్లయింట్ అయిన **దేవరపల్లి కవిత, భర్త: శౌరీప్రసాద్** గారు పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు సబ్ రిజిస్ట్రీ, 28వ డివిజన్ లోని, రామరాజు భూషణం వీధి, టి.యస్.నెం. 18పి, 21పి, ఫ్లాటు నెం.55-బి, 606-00 చ॥గ॥లలో నిర్మించుకున్న విజయ ఎన్‌క్లేవ్ అపార్ట్మెంట్ నందు మూడవ ఫ్లోర్‌లోని ఫ్లాట్ నెం. 301 ఫ్లాటును క్రయం పొందుటకు నిర్ణయించుకుని 24-03-2022వ తేదీన రాంపల్లి సుబ్బారాయుడు గారి భార్య శ్రీమతి రాంపల్లి సత్య జ్ఞాన ప్రసూనాంబ తరుపున డెవపల్మెంట్ అగ్రిమెంట్ కమ్ జనరల్ ఆఫ్ అటార్నీ ఏజెంట్ అయిన శ్రీ బొమ్మగంటి నాగేశ్వరరావుగారి కుమారుడు బొమ్మగంటి ఫణికుమార్ మరియు విజయ కన్స్ట్రక్షన్ వారి నుండి క్రయ అగ్రిమెంట్ను పొందియున్నారు. సదరు షెడ్యూలు దాఖలా స్థలమునకు సంబంధించిన ది.05-12-1951వ తేదీన శ్రీ రుద్రపాక వియ్యేశ్వరశర్మ గారు క్రయం పొందిన ఒరిజినల్ దస్తావేజు నెం.4427/1951 లోగడనే గైర్వలయ అయినదని స్థల యజమానులు తెలియపరచి యున్నారు. మా క్లయింటు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏలూరు బ్రాంచి నందు పై ఉదహరించిన షెడ్యూలు దాఖలా ఫ్లాటును క్రయం పొందుటకు ఋణం మంజూరు పొందుటకు దరఖాస్తు చేసియున్నారు. కావున సదరు బ్యాంక్ నుండి (వారికి సంబంధిం చిన కార్యకలాపములు) ఋణం పొందు వ్యవహారం యందు ఎవ్వరికైననూ ఎటు వంటి అభ్యంతరములు, ఆక్షేపణలు, క్లయిములు ఉన్న యెడల ఈ క్రింది అడ్రస్ గల వారికి లిఖితపూర్వకముగా రిజిష్టరు పోస్టు ద్వారా ఈ ప్రకటన వెలువడిన పదిహేను (15) రోజులలోగా తెలియపర్చవలసినదిగా కోదరమైనది.
ఏలూరు, ది.18-01-2023.

బి.వి.అప్పారావు
అడ్వకేట్, సాయిబాలాజీ థియేటర్ వద్ద, 1టౌన్, ఏలూరు, సెల్: 94401 88346

In The Court Of The Addl. Senior Civil Judge :: Eluru
E.P.No. 20/2020
O.S.No. 37/2016

Between:
Agireddy Jaya Lakshmi ***...D.H.R***
AND
Midatani Naga Mani ***...J.D.R***

వేలం ప్రకటన

పై నెంబరు గల ఇ.పి.లో ఇ.పి. షెడ్యూలు దాఖలా ఆస్థిని **ది.15-02-2023వ తేదీ ఉదయం గం॥ 10:30 ని॥లకు వేలం వేయబడును.** వేలంలో పాల్గొనవలసిన వారు (ఆసక్తి కలవారు) పై కోర్టు ఎదుట ది.15-02-2023వ తేదీ ఉదయం గం॥ 10:30 ని॥లకు ఆధారు కార్డు ఒరిజినల్ మరియు 1/4 అమౌంటు తో హాజరు కావలెను.

E.P. SCHEDULE PROPERTY

An extent of 28-7-10 Sq. Yards Site and a RCC Roof Shed house in the Ground Floor and a Tiled House Ist Floor herein bearing D.No. 20F-16-13, Assessent No. 33704 in T.S.No. 1216 situated in chodidibba, 49th Division, Eluru, Sub Division Eluru Municipal Corporation, W.G.District Within the following boundaries:
East: Joint Wall of Mutta Satyavini's House and This House.
South: Joint Wall of Nagarapu Paidamma's House and this House.
West: Joint Wall of Gulipalli Ramu's House and This House.
North: Road.

DHR Value : Rs.5,00,000/-
Amina Value : Rs.6,00,000/-

Be Pleased to Consider
K.BHASKARA RAO,
P.SRINIVASA RAO,
Advocates for DHR,
Eluru, 19-01-23. Eluru.